సాక్షి తిరుపతి

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025

I



కూటమి నేత దౌర్జన్యం

వెంకటగిరి నియోజకవర్గం, బాలాయపల్లి మండలంలో ఓ కూటమి నేత చెలరేగిపోతున్నాడు. - II లో



దూసుకెళ్లిన శ్రీసిటీ బస్సు

శ్రీసిటీలోని ఓ కంపెనీకి చెందిన బస్సు అతివేగంగా కాలువలోకి దూసుకెళ్లింది. 22 మందికి గాయాలయ్యాయి. - II లో



అన్నదాత 'గజ గజ'

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అన్నదాత గజ గజ వణికిపోతున్నాడు. ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. - II లో

న్యూస్‌రీల్

12 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో 12 మంది డిప్యూటీ ఎంపీడీఓలు, ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీడీనెల్లూరు, రామకుప్పం, వెదురుకుప్పం, పులిచెర్ల ఎంపీడీఓ కార్యాలయాల్లో డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉన్న హరిప్రసాద్‌రెడ్డి, రాధాకృష్ణ, పురుషోత్తం, రాజశేఖర్‌బాబును చిత్తూరు జిల్లాకు కేటాయించారు. అలాగే కడప, అనకాపల్లిలో పనిచేస్తున్న హరిప్రసాద్‌రెడ్డి, శిరీషను చిత్తూరు జిల్లాకు ఇచ్చారు. ఎర్రవారిపాళెం, నాగలాపురంలో విధులు నిర్వహిస్తున్న మాలతి, వెంకటరమణను తిరుపతి జిల్లాకు కేటాయించారు. నగరి, గంగవరం, బైరెడ్డిపల్లె ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏఓలుగా పనిచేస్తున్న సతీష్, భాస్కర్, మహేష్‌కు ఉద్యోగోన్నతి కల్పించి, చిత్తూరు జిల్లాకు కేటాయించగా, రామసముద్రం ఏఓ గౌస్‌బాషాను కడప జిల్లాకు ఇచ్చారు. జిల్లాకు ఎంపీడీఓలుగా వచ్చినవారికి త్వరలో సీఈఓ రవికుమార్‌నాయుడు మండలాలను కేటాయించనున్నారు.

3,947 మందికి మత్స్యకార భరోసా



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

తిరుపతి అర్బన్: జిల్లాలో 3,947 మంది మత్స్యకారులకు మత్స్యకార భరోసా పంపిణీ చేశారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తోపాటు సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, మత్స్యశాఖ జిల్లా అధికారి రాజేష్ చేతులమీదుగా ఒక్కో మత్స్యకారుడికి రూ.20 చొప్పున రూ.7.89కోట్లు పంపిణీ చేశారు. చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ మండలాలకు చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు. అనంతరం మత్స్యకారులు తమ సమస్యలను కలెక్టర్ వద్ద ఏకరువు పెట్టారు. ఆక్వా జోన్‌తో సంబంధం లేకుండా ఆక్వా కల్చర్ చేసుకునే రైతులకు యూనిట్‌కి 1.50 పైసలతో విద్యుత్ సరఫరా, పులికాట్ ముఖద్వారం, రోడ్లు, పాఠశాల ఏర్పాటు, తమిళనాడు జాలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



హామీలు అమలు చేయలేదంటూ కరపత్రాలను చూపిస్తున్న ఆటో డ్రైవర్ కుటుంబం

'బాబు గారడీ మాటలకు పడిపోయాం. సూపర్ సిక్స్ అంటే ఉప్పొంగిపోయాం. గతంలోకంటే అధికంగా లబ్ధి పొందొచ్చని ఆశపడ్డాం. కానీ మా ఆశలపై నీళ్లు చల్లారు. ఓట్లు వేయించుకుని కూటమి నేతలు నిలువునా ముంచేశారు. ఇదిగో సూపర్ సిక్స్.. అదిగో సూపర్ సిక్స్ అంటూ బురిడీ కొట్టిస్తున్నారు..' అంటూ తిరుపతి నగర వాసులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ పది నెలల కాలంలో తమకు జరిగిన నష్టాన్ని తలుచుకుని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. జగనన్న ఉండి ఉంటే ఇలా జరిగేది కాదని.. తమకు తగిన శాస్తి జరిగిందని.. వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఎదుట తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కారు.



బాబు గారడీ.. సూపర్‌గా బురిడీ!

కూటమికి ఓట్లేసి మోసపోయాం

- సూపర్‌సిక్స్ హామీలపై చంద్రబాబు నాన్చుతున్నారు
- అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఒక్క హామీని నెరవేర్చ లేదు
- పది నెలల్లో రూ.లక్ష నుంచి రూ.ఒకటిన్నర లక్ష వరకు నష్టపోయాం
- సూపర్ సిక్స్ హామీలపై నిట్టూర్పులు
- బాబు మోసాలను ఎండగడుతూనే ఉంటాం : భూమన అభినయ్‌రెడ్డి



కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి మోసపోయామంటూ అభినయ్‌రెడ్డి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న కాంచన కుటుంబం

తిరుపతి మంగళం: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాల కంటే మూడింతలు ఎక్కువగా ఇస్తామని చంద్రబాబు ఎన్నికల్లో పదేపదే చెబితే నమ్మి కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేశాం.. ప్రభుత్వం ఏర్పడి పది నెలలవుతున్నా ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో నిలువునా మోసపోయాం' అంటూ తిరుపతి 3వ డివిజన్‌లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన శనివారం ఇంటింటికీ వెళ్లి గత జగనన్న ప్రభుత్వంలో ఏయే సంక్షేమ పథకాలు పొందారు.. కూటమి ప్రభుత్వంలో ఏ పథకాలు పొందారన్న విషయాలపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఇప్పటి వరకు ఏవైనా నెరవేర్చారా..? అని ఆరా తీశారు. చంద్రబాబు ఎన్నికల్లో చెప్పారే గానీ ఇంతవరకు ఆ పథకాలేవీ రాలేదని.. ఎలాంటి లబ్ధి చేకూరలేదని ప్రజలు చెప్పుకొచ్చారు. దేవుడి లాంటి జగనన్నను కాదనుకుని చంద్రబాబుకు ఓట్లేసినందుకు తగిన శాస్తి జరిగిందని కుమిలిపోయారు.

రూ.1.41 లక్షల నష్టం

గత జగనన్న పాలనలో రూ.7లక్షలకు పైగా లబ్ధి పొందాం. కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల్లో సుమారు రూ.1, 41లక్షలు నష్టపోయాం. దేశంలోనే ఏ నాయకుడూ అందించలేనన్ని సంక్షేమ పథకాలు అందించిన జగన్‌మోహన్‌రెడ్డిని కాదనుకుని కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి మోసపోయాం.

– కాంచన, లెనిన్‌నగర్, 3వ డివిజన్, తిరుపతి

మూడు నామాలు పెట్టారు

జగనన్న పాలనలో రూ.9లక్షలకు పైగా లబ్ధిపొందాం. కూటమి ప్రభుత్వంలో రూ.87వేల వరకు నష్టపోయాం. జగనన్నకు చేసి ద్రోహానికి తగిన ఫలితం అనుభవిస్తున్నాం. చంద్రబాబు హామీలను నమ్మినందుకు మాకు తగిన బుద్ధి చెప్పారు. మూడు పార్టీలు కలిసి మూడు నామాలు పెట్టారు.

– కౌసల్య, లెనిన్‌నగర్ తిరుపతి

పేదలపాలిటి దేవుడు జగనన్న

జగనన్న ప్రభుత్వంలో రూ.12లక్షల వరకు లబ్ధి పొందాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు రూ.86 వేల వరకు నష్టపోయాం. పేదలపాలిటి దేవుడు జగనన్న. జగనన్న లేనిలోటు మా జీవితాల్లో కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. చంద్రబాబు పాలనలో మా జీవితాలు చీకటి అలముకుంది. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదు.

– సరోజమ్మ, లెనిన్‌నగర్, తిరుపతి

బాబు ఘరానా మోసం



చంద్రబాబు ఘరానా మోసాల కరపత్రాలను చూపిస్తున్న అభినయ్‌రెడ్డితో పాటు పార్టీ శ్రేణులు

ఎన్నికల్లో నోటికొచ్చిన అబద్ధాలన్నీ చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సూపర్‌సిక్స్ హామీలను గాలికి వదిలేసి ప్రజలను మోసగించారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మండిపడ్డారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి, రైతు నేస్తం, మహిళలకు ఉచిత బస్సు వంటి సూపర్‌సిక్స్ హామీలలో ఏ ఒక్కటీ ప్రజలకు అందక విలవిల్లాడుతున్నారని వాపోయారు. అధికార దాహంతో ప్రతిసారీ నోటికొచ్చిన అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ధ్వజమెత్తారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలతో ప్రతి పేద, బడుగు కుటుంబాలు ఎంతో సుఖపడ్డాయని గుర్తుచేశారు. జగనన్నకు ఓట్లు వేయనందుకు ప్రజలు ఎంతో బాధపడుతున్నారన్నారు. అయినా ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడుతూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్ తమ్ముడు గణేష్, లడ్డూ భాస్కర్, వార్డు అధ్యక్షులు వెంకటేష్‌రాయల్, సోమశేఖర్‌రెడ్డి, కరాటి శీను, పార్టీ నాయకులు సాకం ప్రభాకర్, షేక్ ఇమ్రాన్‌బాషా, దినేష్‌రాయల్, కోదండ, మల్లం రవి, కిరణ్, మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం భూమి కబ్జాకు యత్నం



కబ్జాదారులతో అధికారుల వాగ్వాదం

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డుకు సమీపంలోని హథీరాంజీ మఠానికి చెందిన 7 సెంట్ల భూమిని పక్కనే ఉన్న ఓ షోరూం వారు కబ్జా చేసేందుకు ప్రయత్నించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. ఎయిర్ బైపాస్ రోడ్డు, తిరుపతి నగర పరిధిలోని సర్వే నం.266/3ఏలో హథీరాంజీ మఠానికి చెందిన 7 సెంట్ల భూమి ఉంది. ఈ స్థలానికి వెనుక పక్కనున్న షోరూం వారు కూటమి నేతల సహకారంతో కబ్జా చేసేందుకు గతంలో ప్రయత్నం చేశారు. అప్పట్లో హథీరాంజీ మఠం అధికారులు అడ్డుకొని ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. అయితే ఇటీవల ప్రహరీ గోడను కూల్చివేయడంతో తిరిగి హథీరాంజీ మఠం అధికారులు ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో శనివారం సదరు మఠం స్థలంలో నిర్మాణాలకు పూనుకోవడంతో.. విషయం తెలుసుకున్న మఠం అధికారులు కబ్జాదారులను అడ్డుకున్నారు. అయితే కూటమి నేతల ఒత్తిడితో మఠం అధికారులు వెనక్కి తగ్గినట్టు సమాచారం.

తాగునీటి సమస్యకు 24 గంటల్లో పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు 24 గంటల్లో పరిష్కారం చూపించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి ట్యాంకర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలోని రెండు కేంద్రాల్లో ఆదివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఆర్వో నరసింహులు తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణాధికారులతో సమావేశమయ్యారు. డీఆర్వో మాట్లాడుతూ జూపార్క్ రోడ్డులోని డిజిటల్ జోన్ ఐడీజెడ్ కళాశాలతోపాటు కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ పరీక్షలకు మొత్తం 1,929 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. అధికారులు నవజ్యోతి, ఆరోగ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో స్వామివారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 64,536 మంది స్వామివారిని దర్శించుకోగా 30,612 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.37 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

నీట్-ఎస్ఎస్‌లో 132వ ర్యాంకు



డాక్టర్ కీర్తికుమార్

చిల్లకూరు: డాక్టర్ ఆఫ్ మెడిసన్‌లో భాగంగా పీజీ అయిన తరువాత రాసే నీట్-ఎస్ఎస్‌లో గూడూరు వైద్యుడికి 132వ ర్యాంకు వచ్చింది. గూడూరు ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ పర్వత కీర్తికుమార్ గత నెలలో చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి నీట్-ఎస్ఎస్ పరీక్షకు హాజరయ్యారు. శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఫలితాల్లో కీర్తికుమార్ 132వ ర్యాంకు సాధించారు. దీంతో ఆయన నివాసం ఉండే కర్నాల వీధి ప్రాంతంలో సంబరాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అత్యవసర విభాగంలో పనిచేయాలనే ఆలోచనతో నీట్-ఎస్ఎస్ రాసినట్టు తెలిపారు.

అన్నదాత 'గజ గజ'



ఏనుగు తొక్కేయడంతో అక్కడికక్కడే చనిపోయిన రైతు సిద్ధయ్య



సిద్ధయ్య (ఫైల్)



చిన్నగొట్టిగల్లు మండలంలో పంట పొలాలపైకి వస్తున్న ఒంటరి ఏనుగు

గ్రామాలమీదికి దూసుకొస్తున్న గజరాజులు

- ఏనుగుల దాడిలో మృత్యువాత పడుతున్న రైతన్నలు
- సరిహద్దు సమస్యలతో చేతులెత్తేస్తున్న అధికారులు
- భయాందోళనలో గ్రామీణులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గజరాజులు స్వైరవిహారం చేస్తున్నాయి. అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. కనిపించిన రైతులను తొండంతో కొట్టి.. కాళ్లతో తొక్కి ప్రాణాలు తీస్తున్నాయి. వారిపైనే ఆధారపడ్డ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

ప్రాణాలు తీసుకుంటున్న రైతులు

శేషాచల అభయారణ్యంలో ఏనుగులకు ఆహారం, నీటి లభ్యత తక్కువ. ఈ క్రమంలో చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, పాకాల మండలాల వైపు దూసుకొస్తున్నాయి. రాత్రుల్లో పంటలు కాపాడుకునేందుకు పొలాల వద్దకు కాపాలగా వెళ్లిన రైతులను గుర్తించి తొక్కి చంపేస్తున్నాయి. గత పది నెలల కాలంలో తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ముగ్గురు రైతులు, చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గంలో ఒకరు ఏనుగుల దాడిలో మృతి చెందారు.

వేధిస్తున్న జిల్లాల సరిహద్దు సమస్య

చిత్తూరు జిల్లా పరిధిలోని పలమనేరు వద్దనున్న కౌండిన్య అభయారణ్యం నుంచి ఏనుగులను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు దారి మళ్లించాల్సి ఉంది. కానీ ఎలిఫెంట్ ట్రాకర్లు శేషాచలం అడవుల్లోకి తరిమేస్తున్నారు. ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి జిల్లాలు వేరు కావడంతో అటవీశాఖ ఉన్నతాధికారుల్లో సరిహద్దు సమస్య తలనొప్పిగా మారింది.

తిరుపతి జిల్లాలో ఎలిఫెంట్ ట్రాకర్లు నిల్

చిత్తూరు జిల్లా పరిధిలో ఎలిఫెంట్ ట్రాకర్ల నియామకం భారీ ఎత్తున చేపట్టారు. కొత్తగా ఏర్పాటైన తిరుపతి జిల్లాలో మాత్రం అలాంటి చర్యలేవీ చేపట్టలేదు. తిరుపతి జిల్లాలో ఎలిఫెంట్ ట్రాకర్లు లేకపోవడం, పలమనేరు పరిసరాల నుంచి ఏనుగులు పెద్ద సంఖ్యలో శేషాచలం అడవులకు చేరడంతో వాటిని కట్టడి చేయలేకపోతున్నట్టు అటవీ శాఖలో పనిచేసే ఒక అధికారి చెబుతున్నారు. చిత్తూరు జిల్లా పరిధిలో పనిచేసే ఎలిఫెంట్ ట్రాకర్లను ఇక్కడ ఉపయోగించుకోవడానికి నిబంధనలు అడ్డొస్తున్నట్టు పేర్కొన్నారు. విధిలేని పరిస్థితుల్లో అటవీ శాఖలో పనిచేసే వాచర్లు, బేస్ క్యాంపు సిబ్బందిని వాడుకుంటున్నట్టు సమాచారం.

మొక్కుబడిగా పరిహారం

గత ఏడాది మార్చిలో పాకాల మండలంలోని పదిపుట్లబైలు, ఇ.పాలగుట్టపల్లి, వల్లివేడు, తోట తిమ్మయ్యపల్లి, పేరసానిపల్లి గ్రామాల్లో మొక్కుబడిగా ఒకరిద్దరికి పరిహారం అందించారు. పంట నష్టం జరిగిన మిగతా రైతులు అర్జీలు పెట్టుకున్నా ఇప్పటి వరకు పరిహారం అందలేదు. అలాగే చిన్నగొట్టిగల్లు మండలం, పులిచెర్ల, చంద్రగిరి మండలాల్లోని రైతులు కూడా పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు.

రైతుల భద్రత గాలికి

శేషాచలంలో కొండల్లో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఏనుగులు తిష్టవేస్తున్నాయి. సాధారణం వేసవిలో పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో దశాబ్దాల కాలంగా ఏనుగుల సమస్య ఉంది. దీనిపై స్పందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు 50 మందికిపైగా ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను నియమించాయి. కుంకీ ఏనుగులను అందుబాటులోకి తెచ్చాయి. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఏనుగులు అడవి నుంచి బయటకు రాకుండా అటవీ సరిహద్దుల్లో ట్రెంచ్‌లను ఏర్పాటు చేశారు. అధనంగా ట్రాకర్లను నియమించారు. దీంతో కొంతవరకు ఏనుగుల సమస్య తగ్గింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక వాటన్నింటినీ పక్కనపెట్టడంతో మళ్లీ సమస్య మొదటికొచ్చింది.

వరుస ఘటనలివే

- ఈ ఏడాది జనవరి 19న చంద్రగిరి మండలం, నారావారిపల్లి సమీపంలోని బి.కొంగర వారిపల్లి వద్ద ఉప సర్పంచ్ రాకేష్ చౌదరిని ఏనుగులు తొక్కి చంపేశాయి.
- జనవరిలోనే చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల మండలంలో ఓ రైతును, నాలుగు నెలల కిందట పాకాల మండలం చెన్నుగారిపల్లి వద్ద మరో వ్యక్తిని చంపేశాయి.
- ఫిబ్రవరి, మార్చి నెలల్లో 17 ఏనుగులు తిరుపతి జిల్లాలోని పాకాల, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, చిత్తూరు జిల్లా పరిధిలోని పులిచెర్ల, సదుం, సోమల, ఐరాల మండలాల్లో స్వైర విహారం చేశాయి. వందలాది ఎకరాల్లో పంటను నాశనం చేశాయి.
- చంద్రగిరి, పాకాల మండలాల్లో గత రెండు నెలలుగా ఏనుగులు పంటలను తొక్కినాశనం చేస్తున్నాయి.
- నెల క్రితం చంద్రగిరి మండలం, భీమవరం నుంచి పులిచెర్ల మండలం, కొత్తపేటకు వెళ్లే అటవీ మార్గంలో వాహనదారులపైకి ఏనుగులు దాడికి ప్రయత్నించాయి.
- చిన్నగొట్టిగల్లు మండలం, చిట్టేచర్ల పంచాయతీ, దాసరిగూడెంకు చెందిన సిద్ధయ్య అనే రైతును శుక్రవారం రాత్రి ఓ ఏనుగు తొక్కి చంపింది.

పంట పొలాల వద్దకు వెళ్లలేకున్నాం



పట్టపగలు ఏనుగులు వచ్చేస్తున్నాయి. పొలాల వద్దకు ఒంటరిగా వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. గుంపులు గుంపులుగా వెళ్లాలంటే అందరికీ ఒకే సారి పొలాల వద్ద పనులు ఉండవు. ఒక వేళ రైతులు గుంపుగా వెళ్లినా ఏనుగులు తిరగబడితే ఏం చేయగలం.
– వీరయ్య, రైతు, దాసరిగూడెం, చిట్టేచర్ల

బతకలేకపోతున్నాం



అడవులకు సమీపంలో పంట పొలాలను సాగు చేసుకుని బతుకుతున్నాం. గత కొన్ని నెలలుగా ఏనుగులు విపరీతంగా వచ్చేస్తున్నాయి. మహిళలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఏనుగులు పొలాల్లోకే కాదు గ్రామాల్లోకి కూడా చొరబడుతున్నాయి.
– నాగమునెమ్మ, మహిళా రైతు, దాసరిగూడెం

చర్యలు తీసుకుంటాం

ఏనుగులను దారి మళ్లించేందుకు సరిపడా సిబ్బంది లేరు. ఉన్న వారితో టపాకాయలు పేల్చి వీలైనంత వరకు పంట పొలాలు, గ్రామాలపైకి రాకుండా కట్టడి చేస్తున్నాం. ఏనుగులు వచ్చినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎలిఫెంట్ ట్రాకర్స్ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వీలైనంత వరకు ఒంటరి ఏనుగులకు రైతులు దూరంగా ఉండాలని సూచిస్తున్నాం.
– వెంకటరమణ నాయక్, భాకరాపేట రేంజ్‌జి అధికారి

కాలువలోకి దూసుకెళ్లిన శ్రీసిటీ బస్సు

- 22 మందికి స్వల్ప గాయాలు



ధ్వంసమైన బస్సు అద్దం

నాగలాపురం: పెను ప్రమాదం తప్పింది. శ్రీసిటీలోని ఓ కంపెనీకి చెందిన బస్సు అతివేగంగా కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 22 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ సునీల్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీసిటీలోని ఓ కంపెనీకి చెందిన బస్సు కార్మికులను ఎక్కించుకుని నాగలాపురానికి వస్తోంది. మార్గమధ్యంలో వేంబాకం దళితవాడ వద్ద బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. బస్సులో మొత్తం 35 మంది కార్మికులుండగా.. అందులో 22 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాగలాపురం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం 9 మందిని నగరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇందులో బస్సు డ్రైవర్ అరవింద్‌కు ఊపిరి పీల్చుకోవడంలో కాస్త ఇబ్బందిగా ఉన్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు. బస్సు వేగంగా నడపడం వల్లే ప్రమాదానికి గురైనట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వడ దెబ్బతో కూలీ మృతి

వాకాడు: వడ దెబ్బ తగిలి కూలీ మృతి చెందిన ఘటన శనివారం మండల కేంద్రమైన వాకాడులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు.. వాకాడు టెంకాయతోపు కాలనీకి చెందిన బండి మునీంద్ర(27) దినసరి కూలీ. రోజూలాగే కూలి పనులు చేసుకుంటున్న సమయంలో మునీంద్ర ఎండ తీవ్రతను తట్టులేక సొమ్మసిల్లి పడిపోయాడు. హుటా హుటీన వాకాడు ఆస్పత్రికి తరలించేలోపే మునీంద్ర మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్వర్ణసాగరం ట్రస్టు నిర్వాహకుడు దామా విజయ్ కుమార్ మృతుడి కుటుంబానికి రూ.5 వేలు నగదు సాయం అందించారు.

కూటమి నేత దౌర్జన్యం

బాలాయపల్లి(సైదాపురం): కూటమి నేత దౌర్జన్యాలకు ఓ కుటుంబం కుమిలిపోతోంది. ఈ ఘటన బాలాయపల్లి మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం.. బాలాయపల్లి మండలం, మన్నూరు గ్రామానికి చెందిన ఒప్పతొట్టి రవీంద్రయ్యతోపాటు మరో 61 మంది దళితులకు అదే గ్రామ సర్వే నం.6లో ప్రభుత్వం లీజు పట్టాలు జారీచేసింది. ప్రస్తుతం సాగునీటి కొరత కారణంగా ఆ భూములు బీళ్లుగా వదిలేశారు. ఇటీవల రవీంద్రయ్య మృతిచెందడంతో.. ఇదే అదునుగా భావించిన కూటమి పార్టీలకు చెందిన ఓ చోటా నేత చెలరేగిపోయాడు. మృతుడికి ఉన్న రెండు ఎకరాల్లో పాగా వేశాడు. అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నాడు. పెద్ద దిక్కును కోల్పోయి ఉంటే ఇలా బరితెగించి ఆ కుటుంబాన్ని వేధించడం ఏంటని స్థానికులు మండిపడుతున్నారు. గతంలో అక్రమార్కులకు అడ్డుతగిలినందుకు రవీంద్రయ్యపై కక్ష్యగట్టి ఇలా వేధిస్తున్నట్టు మృతుని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

చల్లకాలువలో వ్యక్తి మృతి

కోట: కోట క్రాస్‌రోడ్డు వద్ద చల్లకాలువలో మునిగి లక్ష్మక్కకండ్రిగ గ్రామానికి చెందిన పారిచర్ల సుబ్రమణ్యం(40) మృతి చెందాడు. ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మక్కకండ్రిగ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం మరో ఇద్దరితో కలసి చల్లకాలువలో ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో బురదలో కూరుకుపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. గ్రామస్తుల సహకారంతో కాలువలో వెదికి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పదిలో 'దివ్యమైన' మెరుపులు



విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న డీఈఓ కేవీఎస్.కుమార్

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రాల ప్రత్యేక అవసరాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. జిల్లా నుంచి 172 మందికి గాను 156 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 101 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో నారాయణవనం మండలం, పాలమంగళం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మేరువా ఆశిష్ 481 మార్కులతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాడు. అలాగే పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పీ.సాత్విక 449 మార్కులతో ద్వితీయ స్థానం, తిరుపతి బైరాగిపట్టెడలోని ఎస్పీ జీఎంఎం విద్యార్థి షేక్ హర్షద్ 430 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచాడు. వీరిని శనివారం డీఈఓ కేవీఎస్.కుమార్ అభినందించి వారికి ట్యాబ్‌లను బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా కో-ఆర్డినేటర్ డీ.చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఓ గోపాలకృష్ణ, ఏఎస్ఓ రుక్మాంగధ పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన దివ్యాంగ విద్యార్థులు



ప్రతిభ చాటిన దివ్యాంగ క్రీడాకారులను అభినందిస్తున్న డీఈఓ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏలూరు జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీడబ్ల్యూఎస్ఎన్ క్రీడా పోటీల్లో తిరుపతి జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో పల్లమాల ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎం.ప్రతాప్ బేస్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాడు. అలాగే 100, 200 మీటర్ల పరుగు పందెంలో శ్రీకాంత్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. వీరిని శనివారం డీఈఓ కేవీఎస్.కుమార్ అభినందించి జ్ఞాపికలతో సత్కరించారు. కోచ్‌లు గోపీకృష్ణ, నాగరాజు, జిల్లా సహిత విద్య కో-ఆర్డినేటర్ డీ.చంద్రశేఖర్‌రెడ్డి, సెక్టోరల్ ఆఫీసర్లు, ఐఈఆర్‌డీలు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్‌లో హాస్టల్ విద్యార్థుల ప్రతిభ



టెన్త్ విద్యార్థులతో కలెక్టర్ వెంకటేశ్వర్



ఇంటర్ విద్యార్థులతో కలెక్టర్

తిరుపతి అర్బన్: సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఉంటూ టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అభినందించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌కు చెందిన విద్యార్థులు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని ప్రత్యేకంగా అభినందించారు. మరింత ఏకాగ్రతకు యోగా, ధ్యానం విద్యార్థులకు నేర్పించాలని సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి విక్రమకుమార్‌రెడ్డిని ఆదేశించారు. అంతరం విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలతోపాటు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆత్మకథ అయిన వింగ్స్ ఆఫ్ ఫైర్‌ను విద్యార్థులకు బహుమతిగా అందజేశారు. ఎస్సీ హాస్టల్స్‌లో పదో తరగతిలో టీ.విశ్వనాథ్–586, బీ.హనుమంతు–580, పీ.భావన–577, డీ.భగీరథ్–566, నీలాకుమార్–559, పీ.భానుశ్రీ–555, ఎం.గుణశేఖర్–552, ఎస్.దినేష్–550 ఉత్తమ మార్కులు సాధించగా.. ఇంటర్‌లో బీ.హైమావతి–942, ఎం.నీలావతి–929, డీ.లక్ష్మిప్రసన్న–915, ఆర్.యువశ్రీ–913, ఎస్.రాజు–911, జీ.సంజయ్–911 అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్టు తెలిపారు.

మహిళకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న నవ్య

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని విన్నమాల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ్య అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. పట్టణంలోని బాలాజీ గార్డెన్ వీధికి చెందిన నవ్య శనివారం విన్నమాల గ్రామ సమీపంలో రోడ్డు దాటుతోంది. అదే సమయంలో నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న కంటైనర్ లారీలో ఉన్న ఐరన్ చానల్ తగిలి తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను 108 అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ నిలపకుండా వెళ్లింది. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.